జ్వాల
తెలుగు న్యూస్

RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

09 ఏప్రిల్ 2026 | మెదక్ | పేజీలు :4 వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 129

## 'విజయ'కేరటం




**బడి పిల్లల ఆరోగ్యంపై సర్కార్ భరోసా**
**క్లాస్ రూమ్‌లో పాల వెల్లువ..**
**రేపటి పౌరులకు పోషకాల విందు**
**టిఫిన్‌తో పాటు పాలు**
**రూ. 120 కోట్లతో శ్రీకారం**
**జూన్ నుంచే విజయ డెయిరీ పాల పంపిణీ**
**"టెట్రా ప్యాక్ – టోటల్ ప్యూరిటీ**
**అంగన్‌వాడీ నుంచి హైస్కూల్ వరకు**
**గిరిజన ప్రాంతాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ**

**హైదరాబాద్ ఏప్రిల్ 08:** తెలంగాణలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. వచ్చే విద్యా సంవత్సరం (2026-27) నుంచి 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే ప్రతి విద్యార్థికి బ్రేక్ ఫాస్ట్‌తో పాటు పాలను అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ ప్రతిష్టాత్మక పథకం అమలుకు సంబంధించి విద్యాశాఖ ఇప్పటికే తొలి అడుగు వేసింది.

**విజయ డెయిరీకి భారీ ఆర్డర్:**
పాల పంపిణీ బాధ్యతను అత్యంత విశ్వసనీయమైన లితెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య (విజయ డెయిరీ)లి కు ప్రభుత్వం అప్పగించింది. ఇందుకోసం తొలి విడతగా రూ. 120 కోట్ల భారీ ఆర్డర్‌ను జారీ చేసింది. జూన్ మాసంలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికే సరఫరాకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

**టెట్రా ప్యాక్‌ల ద్వారా స్వచ్ఛత:**
నిర్వహణ సౌలభ్యం, నాణ్యతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు టెట్రా ప్యాక్‌లలోనే పాలు అందించాలని నిర్ణయించారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో విజయవంతంగా అమలువుతున్న ఈ విధానాన్ని ఇప్పుడు పాఠశాలలకు విస్తరిస్తున్నారు. జాతీయ పోషకాహార సంస్థ నిబంధనల మేరకు విద్యార్థులకు 150 నుంచి 200 మిల్లీ

మిగతా 2లో



## కేంద్రం అభ్యంతరం
## ధర్మాసనం ధిక్కారం

**ఆర్టికల్ 25(2)(బి) ప్రస్తావన**
**సంస్కరణలు చట్టసభల బాధ్యతా?**
**కోర్టుల అధికారమా?**
**మూఢనమ్మకం నిర్వచనం ఏమిటి?**
**మతతత్వ కోణమా లేక ప్రజా ఆరోగ్యమా?**
**క్షుద్రవిద్య ఉదాహరణతో కోర్టు విశ్లేషణ**
**మత విశ్వాసాలకు రాజ్యాంగ పరిమితులపై చర్చ**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 08:** శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం మరియు మతపరమైన ఆచారాల పరిమితులపై సుప్రీంకోర్టులో విచారణ రెండో రోజు ఆసక్తికర మలుపులు తిరిగింది. మతాల్లోని మూఢవిశ్వాసాలను ఎత్తిచూపే మరియు వాటిపై న్యాయపరమైన నిర్ణయం వెల్లడించే అధికారం తమకు ఉందని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది.

**కేంద్రం వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం**
కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. న్యాయమూర్తులు కేవలం చట్టాల్లో నిపుణులని, మతపరమైన అంశాల్లో కాదని పేర్కొన్నారు. సెక్యులర్ కోర్టులు మత సంప్రదాయాలపై తీర్పులు ఇవ్వడం సరైంది కాదన్నది కేంద్రం వాదన. అయితే, ఈ వాదనతో జస్టిస్ అమానుల్లా విభేదించారు. ఒక విధానం ఎంతవరకు మూఢనమ్మకమో నిర్ణయించే హక్కు కోర్టుకు ఉంటుందని, అది కోర్టు పరిధిలోకి వచ్చిన తర్వాతే

మిగతా 2లో

## టెహ్రాన్‌లో టెన్షన్ టెన్షన్



**మరో అడ్వైజరీ..**
**మరింత అప్రమత్తత**
**ముంచుకొస్తున్న ముప్పును పసిగట్టిన భారత నిఘా వర్గాలు**
**భారత పౌరులను సురక్షితంగా రప్పించేందుకు కదులుతున్న యంత్రాంగం**

2



## నో వయలెన్స్..

**నో బూత్ జామ్**
**స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం ఈసీ 'చతుర్విధ' వ్యూహం.**
**సీఈసీ చాంబర్‌లో రసాభాస**
**ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ వర్సెస్ జ్ఞానేశ్ కుమార్**

2




## నాదర్‌గుల్ పాపం మీదే!

**పాత బురదను మాకు పూయకండి..**
**అబద్ధాలరావుకు అడ్రస్ ఉండదు**
**హరీశ్‌రావుపై పొంగులేటి నిప్పులు'**
**'వాటాలు దక్కకనే ఆరోపణలు..**
**అక్రమాలను అడ్డుకుంటున్నందుకే అక్కసు!"**
**'కోర్టులో కౌంటర్ వేసింది మేమే**
**నాడు నోరు మెదపని బీఆర్ఎస్ నేడు నీతులు చెబుతోందా?**

2

బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేస్తున్నవన్నీ నిరాధారమైన ఆరోపణలని, కేవలం ఉనికిని కాపాడుకోవడానికే ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాదర్‌గుల్, వట్టినాగులపల్లి భూములకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలోనే అక్రమాలు జరిగాయని, వాటిని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటగట్టాలని చూడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

## బయోమెట్రిక్ చిక్కులు..

**వృద్ధులకు ఐరిస్ తప్పనిసరి**
**ఒక్కొక్కరికీ 20 నిమిషాల సమయం!**
**రాత్రి 9.55కే మూతపడుతున్న ఈ-పోస్ యంత్రాలు..**
**నిరాశతో వెనుదిరుగుతున్న కార్డుదారులు**
**జూబ్లీహిల్స్ నుంచి పటాన్‌చెరు దాకా అదే తీరు**
**ఎండలో గంటల తరబడి వేచి చూడలేక చెప్పుల క్యూ!**
**హైదరాబాద్‌లో 58 లక్షల మంది లబ్ధిదారులు**
**అధికారులు పర్యవేక్షించకపోతే ఇబ్బందులు తప్పవు**



**హైదరాబాద్: ఏప్రిల్ 08:** రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్, మే, జూన్ నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని తీసుకున్న నిర్ణయం లబ్ధిదారులకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన ఈ పంపిణీ ప్రక్రియలో ముందస్తు ఏర్పాట్లు లోపించడంతో, రేషన్ దుకాణాల వద్ద తెల్లవారుజాము నుంచే కిలోమీటర్ల మేర క్యూలు కనిపిస్తున్నాయి. తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రజలు బియ్యం కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది.

**క్షేత్రస్థాయిలో సమస్యల సుడిగుండం:**
నగరంలోని సనత్‌నగర్, ఎల్బీనగర్ వంటి ప్రాంతాల్లో స్టాకు లేదంటూ డీలర్లు బోర్డులు తగిలించడం లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తోంది. కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, బోరబండ ప్రాంతాల్లోని దుకాణాల వద్ద పరిస్థితి దారుణంగా ఉంది. బయోమెట్రిక్ సర్వర్లు మొరాయించడం, వృద్ధులకు వేలిముద్రలు పడకపోవడంతో ఐరిస్ స్కాన్ కోసం అదనపు సమయం కేటాయించాల్సి వస్తోంది. ఒక్కో కార్డుదారుడికి 15 నుంచి 20 నిమిషాల

మిగతా 2లో

### తెలంగాణ భవిష్యత్తుపై...

## కార్పొరేట్ పెట్టుబడి

**సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త వ్యూహం**
**సీఎస్ఆర్ నిధులకు కొత్త 'దిశ'**
**విద్య, వైద్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పిలుపు**
**సామాజిక బాధ్యత..**
**ప్రగతిలో భాగస్వామ్యం**
**కార్పొరేట్ దిగ్గజాలతో సీఎం రేవంత్ భేటీ**
**అంకెల్లో కాదు..**
**ఆశయాల్లో మార్పు రావాలి**
**సీఎస్ఆర్ నిధులపై సీఎం దిశానిర్దేశం**
**"పైసా పైసా సమాజానికే.. 100% సత్ఫలితాలే లక్ష్యం"**



**హైదరాబాద్: ఏప్రిల్ 08:** రాష్ట్ర అభివృద్ధిలో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు కేవలం అంకెలకు పరిమితం కాకుండా, సమాజంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలకాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన కీలక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎస్ఆర్ నిధులను ఖర్చుగా కాకుండా 'భవిష్యత్తుపై చేసే భాగస్వామ్య పెట్టుబడి'గా చూడాలని సూచించారు.

వంద శాతం ఫలితాలే లక్ష్యం:
కంపెనీలు వెచ్చించే ప్రతి రూపాయి వందకు వంద శాతం సత్ఫలితాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్య, వైద్యం, జల వనరుల సంరక్షణకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, కంపెనీలు కూడా వీటిపై దృష్టి సారించాలని కోరారు. "తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి

మిగతా 2లో

## డీజీపీ ఆదేశాలకు విలువ లేదా?

**ఖాకీ వనంలో అవినీతి కలుపు మొక్కలు**
**ఏసీబీ పంజా!**
**అరెస్ట్ చేయకుండా ఉండాలంటే 5 లక్షలు ఇవ్వు..**
**ఇన్‌స్పెక్టర్ కక్కుర్తికి ఏసీబీ చెక్"**
**వరుసగా పట్టుబడుతున్న పోలీసు అధికారులు"**

2



మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
గురువారం 09-04-2026

## ...కార్పొరేట్ పెట్టుబడి

నైపుణ్యం కలిగిన వారిగా తీర్చిదిద్దడమే మన లక్ష్యం. ప్రభుత్వంతో పాటు కంపెనీలు చేతులు కలిపితే మన యువత అంతర్జాతీయ అవకాశాలను సులువుగా అందుకోగలరు” అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**స్థానిక అభివృద్ధికి పెద్దపీట:**
రాష్ట్రంలోని మొత్తం విద్యార్థుల్లో 44 శాతం మంది హైదరాబాద్‌లోనే ఉన్నారని, వారి విద్యా ప్రమాణాలను పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీఎం గుర్తుచేశారు. కంపెనీలు ఎక్కడైతే కార్యకలాపాలు సాగిస్తూ స్థానిక వనరులను వినియోగించుకుంటున్నాయో, అదే ప్రాంత అభివృద్ధికి సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తం కేటాయించాలని ఆయన సూచించారు.

సమన్వయం కోసం ప్రత్యేక యంత్రాంగం:
సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేని లోటును భర్తీ చేస్తూ, ప్రభుత్వం ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నియమించిందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. కంపెనీలు ఈ అధికారితో సమన్వయం చేసుకుంటూ.. విద్య, వైద్యంతో పాటు వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ వంటి రంగాల్లో తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని నిధులు కేటాయించవచ్చని తెలిపారు.

ముందుకు వచ్చిన కార్పొరేట్ దిగ్గజాలు:
ముఖ్యమంత్రి పిలుపునకు కార్పొరేట్ సంస్థల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. విద్యాభివృద్ధి కోసం లిరహేజా గ్రూప్ రూ.50 కోట్లు, లిలిరాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, మరియు లిలియశోద ఫౌండేషన్ రూ.10 కోట్లులి ఇచ్చేందుకు తక్షణమే ముందుకు వచ్చాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారిని అభినందించారు. ప్రభుత్వమే నేరుగా తమను సంప్రదించి, అభివృద్ధిలో భాగస్వాములను చేయడంపై కార్పొరేట్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సమావేశంలో వివిధ ఫౌండేషన్ల ప్రతినిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు అజిత్ రెడ్డి, యోగితా రాణా, వెంకటేష్ ధోత్రే, శ్రీదేవసేన, నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

## ‘విజయ’ కెరటం

లీటర్ల పాలు ప్రతిరోజూ అందించనున్నారు.
**60 ఏళ్ల విశ్వసనీయత.. ‘విజయ’ ఘనత:**ఆరు దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన విజయ డెయిరీ, పాడి రైతుల సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తోంది. టీటీడీ వంటి ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థలకు ఉత్పత్తులను సరఫరా చేసే స్థాయి నుంచి నేడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాలు అందించే బాధ్యతను చేపట్టడం విశేషం. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో రూ. 250 కోట్లతో ఏర్పాటు చేసిన మెగా డెయిరీ ద్వారా ఈ సరఫరాను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.
**లక్ష్యం - ఆరోగ్యవంతమైన తెలంగాణ:**కేవలం విద్యనే కాకుండా విద్యార్థుల శారీరక దారుఢ్యంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంతాల్లోని లక్షలాది మంది పాడి రైతులకు మేలు జరుగుతూనే, అటు విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందాలనేదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య ఉద్దేశ్యం.

## బయోమెట్రిక్ చిక్కులు

సమయం పడుతుండటంతో, రోజంతా వేచి ఉన్నా 30 నుంచి 40 మందికి మించి పంపిణీ జరగడం లేదు.
**అపరిష్కృత ఇబ్బందులు:**సమయ పరిమితి: రాత్రి 10 గంటలకంటే ముందే ఈ-పోస్ యంత్రాలు ఆగిపోతుండటంతో క్యూలో ఉన్నవారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. రేషన్ దుకాణాలు ఇరుకు గదుల్లో ఉండటంతో, మూడు నెలల భారీ స్టాకును నిల్వ చేసే అవకాశం లేక తరచూ షాపులను మూసివేస్తున్నారు. నెలాఖరు వరకు పంపిణీ ఉంటుందని ప్రభుత్వం చెబుతున్నా, స్టాకు ఎక్కడ అయిపోతుందోనన్న భయంతో జనం ఎండలో సైతం బారులు తీరుతున్నారు.
**పరిష్కార మార్గాలు ఇవే:**ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. సాంకేతిక సమస్యలు లేకుండా సర్వర్లను బలోపేతం చేయాలి. ఈ-పోస్ యంత్రాలు రాత్రి 11 గంటల వరకు పని చేసేలా సమయాన్ని పెంచాలి. అలాగే, డీలర్లు టోకెన్ల విధానాన్ని పక్కాగా అమలు చేసేలా అధికారులు పర్యవేక్షించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. హైదరాబాద్ పరిధిలోని 15.82 లక్షల కార్డుదారులకు సజావుగా బియ్యం అందాలంటే అధికారుల నిరంతర తనిఖీలు అత్యవసరం.
మొత్తం రేషన్ కార్డులులి 15.82 లక్షలు
లబ్ధిదారుల సంఖ్యలి 58.12 లక్షలు
పంపిణీ చేయాల్సిన బియ్యం 14,423 మెట్రిక్ టన్నులు
మొత్తం రేషన్ దుకాణాలులి 1,567

## డీజీపీ ఆదేశాలకు విలువ లేదా

హైదరాబాద్ ఏప్రిల్ 8: యూనిఫామ్, అవినీతి రెండూ కలిసి ఉండలేవు” అంటూ తెలంగాణ డీజీపీ బీ శివధర్‌రెడ్డి పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన సంకేతాలు పంపినప్పటికీ, క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు తమ పంథాను మార్చుకోవడం లేదు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన ఖాకీలు, అక్రమ సంపాదనకు అలవాటు పడి ఏసీబీ వలకు చిక్కుతున్నారు. తాజాగా శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ పోలీస్ అవుట్ పోస్టులో జరిగిన ఏసీబీ దాడి పోలీసు శాఖలో కలకలం రేపింది.
**లక్షల్లో డిమాండ్.. ఏసీబీకి పట్టివేత**
ఒక కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు మరియు నిందితుల కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయకుండా ఉండేందుకు ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్ ఇన్‌స్పెక్టర్ సంపాతి కనకయ్య, ఎస్సై యూ.కే. సిద్ధేశ్వర్ కలిసి రూ. 5 లక్షలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మంగళవారం రాత్రి రూ. 2 లక్షల నగదు తీసుకుంటుండగా ఇన్‌స్పెక్టర్ మరియు ఎస్సైలను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
**డీజీపీ హెచ్చరికలు పెడచెవిన:**
డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజుల్లోనే శివధర్‌రెడ్డి గారు సిబ్బందికి లేఖ రాస్తూ.. “ప్రజా సమస్యలు పరిష్కరించండి, లంచాలకు దూరంగా ఉండండి” అని సున్నితంగా హెచ్చరించారు. బుధవారం కూడా ఆయన మరోసారి ఇదే అంశంపై గట్టిగా స్పందించారు. అయినప్పటికీ, కొందరు అధికారులు డీజీపీ ఆదేశాలను బేఖాతరు చేస్తూ అవినీతి ఊబిలో కూరుకుపోతున్నారు.
**వేగవంతమైన ఏసీబీ దర్యాప్తులు:**
పోలీసుల తీరుపై ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ తన దాడుల వేగాన్ని పెంచింది. శాంతిభద్రతలు కాపాడవలసిన వారే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అవినీతికి పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## నాదర్‌గుల్ పాపం మీదే

హైదరాబాద్ ఏప్రిల్ 08: బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేస్తున్నవన్నీ నిరాధారమైన ఆరోపణలని, కేవలం ఉనికిని కాపాడుకోవడానికే ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాదర్‌గుల్, వట్టినాగులపల్లి భూములకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలోనే అక్రమాలు జరిగాయని, వాటిని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటగట్టాలని చూడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.
**అబద్ధాల పునాదులపై రాజకీయం:**నాదర్‌గుల్ సర్వే నంబర్ 613లోని భూములను 2014లోనే మూడు సంస్థలకు రిజిస్ట్రేషన్ చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రి గుర్తు చేశారు. 2016లో మ్యుటేషన్ జరిగినప్పుడు కూడా వారి ప్రభుత్వమే అధికారంలో ఉందని, దీనికి ప్రస్తుత ప్రభుత్వానికి ఏం సంబంధమని నిలదీశారు. “2022లో నిర్మాణాలు మొదలైనప్పుడు, సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేయకుండా భూములు కట్టబెట్టిన ఘనత మీది. ఆనాడు వాటాల ఒప్పందం కుదరకనే హరీశ్‌రావు ఇప్పుడు ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారు” అని ఆరోపించారు.
**నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం:**హరీశ్‌రావు పేర్కొన్న కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉన్నట్లు నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమని మంత్రి సవాల్ విసిరారు. “ఏ కంపెనీలోనైనా నా కుటుంబ సభ్యుల పేరు ఉన్నట్లు నిరూపిస్తే నేను ముక్కు నేలకు రాస్తాను.. మీరు సిద్ధమేనా?” అని ప్రశ్నించారు. వట్టినాగులపల్లిలో తన కుమారుడు భూములు కొన్నారని చేస్తున్న ప్రచారం కూడా అబద్ధమేనని, అక్కడ హోమ్ అనే సంస్థ గత ప్రభుత్వ అండతో భూ కబ్జాలకు పాల్పడిందని ధ్వజమెత్తారు.
**అభివృద్ధిని చూసి ఓర్వలేక..**సన్నబియ్యం పథకం, హ్యామ్ రోడ్ల నిర్మాణం వంటి ప్రజాహిత పనులకు వస్తున్న స్పందన చూసి బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని మంత్రి విమర్శించారు. దేవాలయం వంటి అసెంబ్లీలో ప్రతిపక్ష నేతల ప్రవర్తనను ప్రజలు గమనిస్తున్నారని, ఒక్క ఆధారం లేకుండా వేల కోట్ల అవినీతి జరిగిందని మాట్లాడటం వారి అజ్ఞానానికి నిదర్శనమని అన్నారు. ఏ పాలసీ తెచ్చినా ప్రజలందరికీ సమాన న్యాయం జరిగేలా తమ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# టెహ్రాన్‌లో టెన్షన్...టెన్షన్

**న్యూఢిల్లీ/టెహ్రాన్::**మధ్యప్రాచ్యంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా ఇరాన్‌లోని భారతీయులకు కేంద్ర ప్రభుత్వం మరోసారి కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ నుంచి భారతీయులు వీలైనంత త్వరగా బయటపడాలని విదేశీ వ్యవహారాల శాఖ సూచించింది. ఈ మేరకు ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా అత్యవసర సందేశాన్ని పంచుకుంది.
**సమన్వయం లేకుండా ప్రయాణాలు వద్దు:** అంతర్జాతీయ సరిహద్దుల సమీపంలోకి వెళ్లే భారతీయులు ఖచ్చితంగా భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది. ఎంబసీ అధికారుల సూచనలు లేకుండా లేదా వారితో సంప్రదించకుండా సరిహద్దు ప్రాంతాలకు రావద్దని హెచ్చరించింది. భారతీయులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా లి098 9128109115, o98 9128109109, o98 9128109102, o98 9932179359 వంటి అత్యవసర ఫోన్ నెంబర్లను ప్రకటించింది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినప్పటికీ, ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదని ప్రభుత్వం భావిస్తోంది. గత రాత్రి జారీ చేసిన ఆదేశాల్లో.. భారతీయులు అనవసర ప్రయాణాలు మానుకోవాలని, ముఖ్యంగా విద్యుత్ కేంద్రాలు, సైనిక స్థావరాలు మరియు బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉండాలని సూచించింది. తాజాగా, ఆ దేశాన్ని వీడాలని సూచించడం పరిస్థితి యొక్క సున్నితత్వాన్ని ప్రతిబింబిస్తోంది. మధ్యప్రాచ్యంలో భద్రతా పరిస్థితులు ఎప్పుడు ఎలా మారతాయో తెలియని క్రమంలో, స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను రాయబార కార్యాలయం పర్యవేక్షిస్తోంది. నిరంతరం అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎంబసీ కోరింది.

## నో వయలెన్స్....

**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత కఠిన వైఖరిని ప్రదర్శించింది. రాష్ట్రంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిర్భయంగా జరుగుతాయని స్పష్టం చేస్తూ మమతా బెనర్జీ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా ఈసీ చేసిన పోస్ట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.
**ఈసీ ‘నాలుగు’ సూత్రాలు**
ఎన్నికల నిర్వహణలో ఏమాత్రం రాజీ పడబోమని ఈసీ పేర్కొంది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి సారించింది:
1. హింస లేని ఎన్నికలు
2. బెదిరింపులకు తావులేని వాతావరణం
3. అక్రమ తనిఖీలకు అడ్డుకట్ట
4. బూత్ జామింగ్‌కు చెక్

ఈ లక్ష్యాలను సాధించి తీరుతామని, ఇందులో భాగంగానే టీఎంసీకి సూటిగా హెచ్చరికలు చేస్తున్నామని ఈసీ స్పష్టం చేసింది. సీఈసీ చాంబర్‌లో హైడ్రామా అంతకుముందు, ఓటర్ల జాబితా నుంచి సుమారు 27 లక్షల మంది ఓటర్లను తొలగించారనే అంశంపై చర్చించేందుకు డెరెక్ ఒబ్రెయిన్ నేతృత్వంలోని టీఎంసీ బృందం ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేశ్ కుమార్‌ను కలిసింది. ఈ భేటీ సమయంలో సీఈసీ మరియు డెరెక్ ఒబ్రెయిన్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. సీఈసీ తమపై అరిచారని, వెంటనే బయటకు వెళ్లాలని ఆదేశించారని టీఎంసీ నేతలు ఆరోపిస్తుండగా, ఈ ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది.
**పకడ్బందీగా ఏప్రిల్ సమరం:** ఏప్రిల్ 23 మరియు 29 తేదీల్లో రెండు దశల్లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సాగరికా ఘోష్, సాకేత్ గోకలే, మేనకా గురుస్వామి వంటి నేతలతో కూడిన టీఎంసీ ప్రతినిధి బృందం చేసిన ఫిర్యాదులను ఈసీ కొట్టిపారేస్తూనే, శాంతిభద్రతల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం.

## *కేంద్రం అభ్యంతరం...ధర్మాసనం దిక్కారం*

చట్టసభల నిర్ణయానికి తావు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.
**చట్టసభల పరిధి - కోర్టు జోక్యం**
ఆర్టికల్ 25(2)(బీ) ప్రకారం మత సంస్కరణలు చేపట్టే బాధ్యత చట్టసభలదేనని తుషార్ మెహతా గుర్తుచేశారు. ఒక ఆచారాన్ని కేవలం ‘మూఢనమ్మకం’ అన్న కారణంతో తోసిపుచ్చలేమని, అది ఆ మతతత్వానికి సంబంధించిన అంశమని ఆయన వాదించారు. మహారాష్ట్రలోని క్షుద్రవిద్య నివారణ చట్టం మరియు నాగా లాండ్‌లోని కొన్ని మత విధానాలను ఉదాహరణగా చూపుతూ.. విభిన్న సమాజాల్లో ఆచారాలు విభిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు.
**ప్రజారోగ్యం మరియు నైతికతే ప్రామాణికం**
ఈ చర్చలో జస్టిస్ బాగ్చీ మరియు జస్టిస్ నాగరత్న కీలక ప్రశ్నలు సంధిం చారు. ఒకవేళ క్షుద్రవిద్య వంటి ఆచారాలు మతంలో భాగమైనప్పటికీ, అవి ప్రజల ఆరోగ్యం, క్షేమం నైతికతకు విఘాతం కలిగిస్తే ఆర్టికల్ 32 ప్రకారం కోర్టు జోక్యం చేసుకోవచ్చా అని ప్రశ్నించారు. దీనికి స్పందిస్తూ.. ప్రజా క్షేమం ముడి పడి ఉన్నప్పుడు న్యాయ సమీక్ష సాధ్యమేనని, కానీ కేవలం అభిప్రాయాల ప్రాతిపదికన మత ఆచారాలను తప్పుబట్టలేమని సొలిసిటర్ జనరల్ అంగీ కరించారు. మత విశ్వాసాలకు మరియు రాజ్యాంగబద్ధమైన హక్కులకు మధ్య సమతుల్యతను కాపాడటంపై సుప్రీంకోర్టు చేస్తున్న ఈ విశ్లేషణ, భవిష్యత్తులో మత స్వేచ్ఛకు సంబంధించిన అనేక కేసులకు మార్గదర్శకం కానుంది.
**కీలకమైన ఆర్టికల్ 25(2)(బీ) అంటే ఏమిటి?**
భారత రాజ్యాంగంలోని ఈ నిబంధన ప్రకారం.. సామాజిక సంక్షేమం లేదా సంస్కరణల నిమిత్తం మతపరమైన సంస్థలను అన్ని వర్గాల హిందువులకు (మరియు ఇతర మతస్తులకు సంబంధించి కూడా) అందుబాటులోకి తెచ్చేలా చట్టాలు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. దీనిపైనే ఇప్పుడు కోర్టులో ప్రధాన చర్చ జరుగుతోంది.

# కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్ట్‌కు పనులు ముమ్మరం

### - రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష

### సమావేశం నిర్వహించిన విప్

**వేములవాడ, ఏప్రిల్ 08:** కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్ట్‌కు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులతో కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు పరిశీలించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించిన విప్, పనుల వేగాన్ని పెంచాలని అధికారులకు మరియు కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వచ్చే వర్షాకాలం ప్రారంభానికి ముందే ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల రైతులకు సాగు మరియు త్రాగునీటి అవసరాలను తీర్చే కీలక ప్రాజెక్ట్ అయిన కలికోట సూరమ్మ చెరువు అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. పనుల అమలు పర్యవేక్షణకు ప్రతి 11 రోజులకు ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశాల్లో పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే సుమారు 43 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాంతీయ రైతులకు భారీగా లాభం చేకూరనుంది. ఇప్పటికే ప్రాజెక్ట్‌కు సంబంధించిన కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తయిందని, త్వరలోనే కాలువల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.



# తమిళనాడు లాకప్ డెత్ లాగే మమ్మల్నీ టార్చర్ పెట్టిన్రు

### ఇక్కడి పోలీసులకూ

### అదే శిక్ష పడాలి..

### నేరెళ్ల బాధితుడు కోల హరీశ్

**తంగళ్లపల్లి, ఏప్రిల్ 08 :** తమిళనాడులో జరిగిన తండ్రీకొడుకుల లాకప్ డెత్ కేసులో న్యాయస్థా సం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని నేరెళ్ల ఘటన బాధితుడు కోల హరీశ్ తెలిపారు. ఈ కేసులో తప్పు చేసిన పది మంది పోలీసులకు మరణశిక్ష విధించడం సముచితమేనని ఆయన పేర్కొన్నారు. తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురిచేసిన అప్పటి ఎస్పీ విశ్వజిత్ కంపాటి. ఎస్సై రవీందర్ తో పాటు సంబంధిత పోలీసులపై కూడా ఇలాంటి కఠిన చర్యలు తీ సుకోవాలని సోషల్ మీడియా వేదికగా ఆయన డిమాండ్ చేశారు. తమిళనాడులో వెలువడిన తీర్పు తమకు ధైర్యం నింపిందని, నేరెళ్ల బాధి తులకు కూడా న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హరీశ్ తెలిపారు. అక్కడ బాధి తులకు జరిగినట్లే తమకు కూడా న్యాయం జరగాలని ఆయన కోరారు. పోలీసుల ముసుగులో కొందరు తీవ్ర అరాచకాలు చేస్తున్నారని, ఆ బాధ స్వయంగా తాము అనుభవించామన్నారు. తమిళనాడులో తండ్రీకొడుకులను చిత్రహింస లు పెట్టినట్లే.. తమపై కూడా కొందరు పోలీసులు అమానుషంగా వ్యవహరించారని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా నేరెళ్ల ఘటన కేసును సీబీఐకి అప్పగించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

# పోలంపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి

**చేగుంట ఏప్రిల్ 8 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం పొలంపల్లి గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు తన ఎంపీ నిధుల నుండి మంజూరు చేసిన 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు పనులను బుధవారం గ్రామ సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి పాలకవర్గ సభ్యులతో కలిసి శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ?ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, ప్రతి వీధిలో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రామానికి ఈ నిధులు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించిన బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్లరెడ్డి కృషిని కొనియాడుతూ, ఎంపీ రఘునందన్ రావు కి గ్రామస్తుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.?ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చింతకాయల ప్రవీణ్, మైలారం రాజు, రాపాకుల శేఖర్ గౌడ్, కొండి కలమ్మలతో పాటు గ్రామ పెద్దలు కర్రే స్వామి, పులిమామిడి రాజు, కుమ్మరి యాదగిరి, బుల్లి ఉప్పలయ్య, గొల్ల నర్సింలు, కొండి పద్మారావు, కొండి బిక్షపతి, బీజేపీ నాయకులు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# సమ్మె సైరన్ మోగించిన విద్యుత్ కార్మికులు



**చేగుంట ఏప్రిల్ 08 మెదక్ టుడే న్యూస్**చేగుంట మండలం లో ఉన్న సబ్ స్టేషన్ లో పనిచేస్తున్న ఆపరేటర్ రాష్ట్ర కార్మిక సంఘం పిలుపుమేరకు తెలంగాణ ఎన్ పీ డీ సీ ఎల్ సంస్థలో పనిచేస్తున్న వేలాదిమంది ఆన్ మ్యాన్, ఆర్టీ సన్, పీస్ రేట్ వర్కర్ విద్యుత్ కార్మికులు సమ్మెకు దిగారు, ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం 9 గంటల నుండి సమ్మె ప్రారంభించము అని అన్నారు . విద్యుత్ కార్మికులు సమ్మెకు దిగడంతో విద్యుత్ సంస్థ రెగ్యులర్ ఉద్యోగులతో (లైన్ మెన్ )వారి విధులను నిర్వహించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది

# ఐలాపూర్ భూముల్లో హైడ్రాకు అడుగుపెట్టే హక్కు లేదు

**..న్యాయవాది ముఖిమ్ ఆధ్వర్యంలో పాత్రికేయసమావేశము**

**. పాల్గొన్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ**

**బడుగు బలహీనవర్గాల భూములపై కన్నేసిన రేవంత్ సర్కార్ హైడ్రా పేరుతో దోపిడీకి పాల్పడుతుందనిన్యాయవాది ముఖిమ్ అన్నారు.**

**అమీన్ పూర్ ఏప్రిల్: 08(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** హైడ్రాపై ధ్వజమెత్తిన న్యాయవాది ముఖీమ్మాకు అనుకూలమైన డిక్రీ ఉందని రెవెన్యూ అధికారులు,హైడ్రా అధికారులు ఐలాపూర్ భూములలో ప్రవేశించే హక్కు లేదన్నారు.ఐలాపూర్ భూముల్లో హైడ్రా అధికారులు తమ వాహనాలతో నిత్యం తిరుగుతూ గ్రామస్తులను ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ముఖీమ్ ఆరోపించారు.కోర్టు పరిధిలో ఉన్న ఐలపూర్ భూములపై డ్రోన్ల ద్వారా నిఘా పెట్టిన అమీన్ పూర్ రెవెన్యూ అధికారుల చర్యలను ఖండిస్తున్నామని తెలిపారు. సంవత్సరం క్రితం ఐలాపూర్ రాజగోపాల్ నగర్ పేరుతో నూతనంగా ఏర్పడిన సొసైటీ హైడ్రా అధికారి రంగనాథ్ తో కలిసి ఐలాపూర్ భూములలో భారీ భూకుంభకోణానికి తెరలేపినట్లు తమకు విశ్వసనీయ సమాచారం ఉందని త్వరలోనే ఆ గుట్టు రట్టు చేస్తామని ముఖీమ్ అన్నారు.ఐలాపూర్ భూముల వ్యవహారంలో రిట్ అప్పీల్ పెండింగ్ ఉందని రిట్ అప్పీల్ ద్వారా హైడ్రా అధికారులు ఐలపూర్ భూముల్లోకి ప్రవేశించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ హైడ్రా అధికారి రంగనాథ్ జోక్యం తగదని హైడ్రా తన నిబంధనలకు లోబడి పనిచేయాలని సూచించారు.గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎవరూ హైడ్రాకు భయపడవద్దని న్యాయస్థానాలు మనకు రక్షణ కవచంలా ఉన్నాయని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఐలాపూర్ భూముల రైతుల పక్షాన గళం వినిపించేందుకు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఐలాపూర్ భూముల వ్యవహారంలో హైడ్రా, రెవెన్యూ అధికారులు నిబంధనలకు అనుగుణంగా సంయమనంతో పనిచేసే విధంగా ఆయా శాఖలను కట్టడి చేయాలని గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేయకుండా కేసులు తుది తీర్పు వచ్చేంతవరకు రైతులను ఇబ్బంది పెట్టకుండా వ్యవహరించే విధంగా ఆదేశాలు ఇవ్వాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు.కోర్టు పరిధిలో లేని వివాదాస్పదం కాని భూముల వ్యవహారంలోకి హైడ్రా, రెవెన్యూ, రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకోవద్దని ఎమ్మార్పీఎస్ తరఫున విజ్ఞప్తి,సూచన చేశారు.రైతులకు ఉండే చట్టబద్ధమైన హక్కులను హైడ్రా కాలరాయొద్దని ఆ భూములలో వ్యవసాయం, నిర్మాణాలు చేసుకునే హక్కులు వారికి ఉంటాయని ప్రభుత్వాన్ని ఉద్దేశించి రైతుల తరఫున హితవు పలికారు.హైడ్రా పరిధిని ప్రశ్నిస్తూ నిబంధనలకు అనుగుణంగా ఈ సంస్థ పని చేస్తుందా లేదా అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేయాలని కోరారు.హైడ్రా తన పరిధి మించి వ్యవహరిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో దానిని అరికట్టే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిధిలో ఉన్నదని అన్నారు.హైడ్రా తన పరిధిని విస్మరించి వ్యవహరించదానికి రాష్ట్ర ప్రభుత్వం వెన్నంటి ఉన్నదని వినిపిస్తున్న ఆరోపణలకు అవకాశం ఇవ్వకుండా పారదర్శకతను నిరూపించుకునే అవసరం ఎంతైనా ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి మందకృష్ణ మాదిగ అన్నారు.ఈ కార్యక్రమంలో ఐలాపూర్ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.





# గణితశాస్త్రంలో పప్పుల అశోక్ కు పీహెచ్.డీ.

పటాన్ చెరు ఏప్రిల్ 08(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి పప్పుల అశోక్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ నమూనాలను ఉపయోగించి క్రిప్టోకరెన్సీ ధర అంచనా: ఒక సమగ్ర తులనాత్మక కాల శ్రేణి విశ్లేషణ' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణాంక శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. మల్లికార్జునరెడ్డి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ డాక్టరల్ పరిశోధన, బిట్ కాయిన్ (బీటీసీ), ఎథేరియం (ఈటీహెచ్), బైనాన్స్ కాయిన్ (బీఎన్ బీ) వంటి అత్యంత అస్థిరమైన డిజిటల్ ఆస్తులను అంచనా వేయడానికి అధునాతన పద్ధతులను అన్వేషించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనం సాంప్రదాయ





గణాంక నమూనాలు, మెషిన్ లెర్నింగ్ టెక్నిక్ లు, డీప్ లెర్నింగ్ ఆర్కిటెక్చర్లను మూల్యాంకనం చేస్తుందని, అంచనా ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి హైబ్రిడ్ మోటల్స్ ను పరిచయం చేస్తుందని వెల్లడించారు.ఈ పరిశోధన ఫలితాల ప్రకారం, హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ మోడల్స్- ముఖ్యంగా దీఱూలువీ-+=ఖ ఫ్రేమ్ వర్కు-ప్రధాన పనితీరు కొలమానాలన్నింటిలో సాంప్రదాయ, స్టాండ్ అలోన్ మోడల్స్ ను గణనీయంగా అధిగమించి, క్రిప్టోకరెన్సీ ధర అంచనాలో మెరుగైన ఖచ్చితత్వం, పటిష్టతను అందిస్తున్నాయని స్పష్టమవుతోందన్నారు. ఈ పరిశోధన, ఆర్థిక అంచనాలలో హైబ్రిడ్ ఏఐ నమూనాల పెరుగుతున్న సామర్థ్యాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, పెట్టుబడిదారులకు, విశ్లేషకులకు, విస్తృత ఫిన్ టెక్ పర్యావరణ వ్యవస్థకు విలువైన అంతర్దృష్టులను అందిస్తుందని తెలిపారు.డాక్టర్ అశోక్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర జాదవ్ గణేష్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గుమ్మడిదల రైతులకు న్యాయం చేయండి..

**భూములు అందించిన ప్రతి రైతుకు వంద గజాలు కేటాయించండి..**

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్..**

గుమ్మడిదల ఏప్రిల్ 08(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెంబరు 109 లో పరిశ్రమల స్థాపన కోసం భూములు అందించిన ప్రతి రైతుకు 100 గజాల ఇళ్ల స్థలం కేటాయించాలని కోరుతూ పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ తో కలిసి కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెంబర్ 109లో గల సుమారు 160 ఎకరాల భూమిని పారిశ్రామిక మౌలిక సదుపాయాల కోసం సేకరించిన సమయంలో రైతులకు నష్టపరిహారంతో పాటు ప్రతి



ఒక్కరికి వంద గజాల నివాస స్థలం ఇస్తామని అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి సమక్షంలో హామీ ఇచ్చినట్లు తెలిపారు. హామీ ఇచ్చి సంవత్సరం గడుస్తున్న నేటి వరకు ప్లాట్ల కేటాయింపు జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్లాట్ల కోసం ఐదు ఎకరాల స్థలాన్ని గుర్తించిన విషయాన్ని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. అయితే ఆ స్థలాన్ని కూడా పరిశ్రమలకు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అలాంటి చర్యలు తీసుకుంటే తీవ్రంగా పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ప్లాట్ల కేటాయింపును త్వరితగతిన చేయాలని కోరారు. ఈ సమస్యపై అధికారులతో చర్చించి ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, వెంకట్రంరెడ్డి, హుస్సేన్ బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
గురువారం 09-04-2026

## చేగుంట మండల కేంద్రంగా హిందూ కుటుంబాల సమ్మేళనం




**చేగుంట ఏప్రిల్ 8 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల కేంద్రంలో ఈనెల 26న సాయంత్రం నాలుగు గంటలకు జరగబోయే హిందూ సమ్మేళన నిర్వహణ సమితి హిందూ కుటుంబాల మహా సమ్మేళనం కార్యక్రమానికి ఈరోజు చేగుంట ఖండ కేంద్రంలో కమిటీని ఏర్పాటు చేశారు ఈ కమిటీ నిర్వాహకులుగా అధ్యక్షులుగా చాట్ల సంతోష్ కుమార్ ని ఉపాధ్యక్షులుగా భువనగిరి నాగరాజు దాస్ మనోహర్ వారాల నరసింహులు కాశి భూపాల్ రెడ్డి మహిళా ఉపాధ్యక్షురాలుగా మంద్రు కళావతి సోమ స్వాతి ని నియమించడం జరిగింది

## చీయా సాగుతో సిరులు పండిస్తున్న మహిళా రైతు

**పుట్టపర్తి,:**శ్రీ సత్యసాయి జిల్లా ఆమడగూరు మండలం, జౌకల కొత్తపల్లికి చెందిన మహిళా రైతు గజ్జల శ్రీదేవి చీయా సాగుతో అద్భుత లాభాలు గడించి సాటి రైతులకు ఆదర్శంగా నిలిచారు.లిసాగు విస్తీర్ణం: 1.30 సెంట్లు.దిగుబడి: 11 క్వింటాల 06 కేజీలు,ఆదాయం: బైబ్యాక్ విధానంలో క్వింటాకు రూ. 14,000 చొప్పున మొత్తం రూ. 1,54,000,నికర లాభం: రూ. 15,000 పెట్టుబడి పోగా,రూ. 1,39,000 మిగిలింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, శ్రీదేవిని ప్రత్యేకంగా అభినందించారు. తక్కువ విస్తీర్ణంలో ఆధునిక పంటల ద్వారా అధిక లాభాలు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. రైతులు ఇలాంటి లాభదాయకమైన పంటల వైపు మొగ్గు చూపాలని, వారికి వ్యవసాయ శాఖ పూర్తి సాంకేతిక సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు.

## రైల్వే స్టేషన్, బస్ స్టాండ్‌లలో సర్ప్రైజ్ చెకింగ్‌లు

అనంతపురం:జిల్లాలో గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడం లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాలతో ఇతర రాష్ట్రాలు మరియు ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి ప్రవేశించే రైళ్లు, బస్సులు మరియు పార్సిల్ సర్వీసులపై విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో సి.ఐ రాజేంద్రనాథ్ యాదవ్ పర్యవేక్షణలో ఎస్ ఐ నరసింహ, ఈగల్ సెల్ అనంతపురం ఎస్సై హనుమంతు ఆధ్వర్యంలో సిబ్బంది సమన్వయంతో తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్స్ డిటెక్షన్ జాగిలం "టైగర్" సహకారంతో తనిఖీలు మరింత సమర్థవంతంగా కొనసాగించారు. స్థానిక రైల్వే స్టేషన్, బస్ స్టాండ్ మరియు పార్సిల్ కార్యాలయాల్లో సర్ప్రైజ్ చెకింగ్‌లు చేపట్టారు. ఇతర రాష్ట్రాల నుండీ అనంతపురం మీదుగా వెళ్తున్న ప్రశాంతి, కర్నాటక ఎక్స్ప్రెస్ రైళ్లలో ప్రయాణీకులకు ఇబ్బంది కల్గకుండా చెక్ చేశారు. ఈ తనిఖీలలో అనుమానాస్పద వ్యక్తులు, అనుమానాస్పద లగేజీ బ్యాగులు, తదితరాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిశీలించారు.ప్రజలు కూడా గంజాయి, తదితర మాదక ద్రవ్యాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని... ఎవరైనా మాదక ద్రవ్యాల సంబంధిత సమాచారం గమనించిన పక్షంలో వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 లేదా అత్యవసర సేవల నెంబర్ 112 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం

**కడప ఏప్రిల్ 08** కడప రిమ్స్ ప్రాంగణం లో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజా సేవలో భాగస్వాములై ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అన్ని రకాలుగా సమాజాన్ని చైతన్య పరుస్తున్న పాత్రికేయుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల కుటుంబాలకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. పాత్రికేయులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం కూడా చైతన్యవంతంగా ఆరోగ్యంగా ఉంటుందని భావించిన కలెక్టర్ ప్రత్యేక చొరవతో జిల్లాలోని జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులకు అన్ని రకాల ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తోంది.

## కాలుష్యం మాకు.. రోగాలు మాకూ.. అభివృద్ధి మీకా..

### సి ఎస్ ఆర్ నిధుల తరలింపు పైన పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆగ్రహం..

### స్థానిక పరిశ్రమల సి.ఎస్. ఆర్. నిధులు స్థానిక అభివృద్ధి పనులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతి..

### నిధులు కేటాయించని పక్షంలో ప్రజా ఉద్యమం..

**పటాన్ చెరు ఏప్రిల్ 08 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని పరిశ్రమల సిఎస్ఆర్ నిధులను స్థానిక అభివృద్ధి పనుల కోసం కేటాయించాలని పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..పచ్చటి పొలాలు.. మూడు పంటలు పండే భూములు.. స్వచ్ఛమైన గాలి.. అందమైన తమ పల్లెల పరిధిలో అభివృద్ధి కోసం నూతన పరిశ్రమలు ఏర్పాటు అయితే తమ గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు స్థానికంగా ఉపాధి లభిస్తుందన్న కొంగత్త ఆశలతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలు 70వ దశకంలో పరిశ్రమల ఏర్పాటునకు స్వాగతం పలికారు అన్నారు.పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఇస్నాపూర్, పాశమైలారం, పటాన్చెరు, జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం, కాజీపల్లి, కిష్టాయపల్లి, బొల్లారం, గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి, గుమ్మడిదల, అమీన్పూర్ మండల పరిధిలోని సుల్తాన్పూర్, గండి గూడెం, దయరా గ్రామాల పరిధిలో వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ప్రధానంగా బల్క్ డ్రగ్స్ పరిశ్రమలతో పాటు కెమికల్స్, మెడిసిన్స్, పెస్టిసైడ్స్ కంపెనీలు ఏర్పాటయ్యాయని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గ కాలుష్య పరిస్థితులపై సుప్రీంకోర్టు సైతం జస్టిస్ మిగతా కమిషన్ ఏర్పాటు చేసి.. ప్రత్యేక నివేదిక తప్పించుకుంది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రంగరాజన్ సైతం స్వయంగా నియోజకవర్గంలో పర్యటించి కాలుష్య పరిస్థితులను తెలుసుకున్నారని పేర్కొన్నారు.సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2016లో చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ కాలుష్య నివారణ అంశంపై కీలక ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కాలుష్యం మూలంగా వ్యాధులకు గురవుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తో పాటు.. ఇస్నాపూర్ పెద్ద చెరువు, గండిగూడెం, ఆసాని కుంట, కిష్టారెడ్డిపేట చెరువుల పరిధిలో సీవరేజ్ ట్రీట్మెంట్ సైతం ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని బల్క్ డ్రగ్స్ పరిశ్రమలు ప్రతి సంవత్సరం తమ లాభాల్లో 0.5 శాతం డబ్బులు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక అకౌంట్లో జమ చేసి.. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణకు ఆదేశాలు సైతం జారీ చేసిందన్నారు. 2023 లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమలు అందిస్తున్న సి.ఎస్.ఆర్ నిధులను స్థానికంగా ఖర్చు చేయకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారని వివరించారు. నీళ్లు నిధులు నియామకాలు అన్న అంశంతో ఏర్పాటైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో.. స్థానిక నిధులు స్థానికంగా ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు . ప్రతి రోజు కాలుష్య జలాలు.. విష వాయువులతో జీవనం కొనసాగిస్తున్న పటాన్చెరు నియోజకవర్గ ప్రజలకు పరిశ్రమలు అందిస్తున్న సి ఎస్ ఆర్ నిధుల ద్వారా వివిధ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నాము. గత రెండున్నర సంవత్సరాలుగా సి ఎస్ ఆర్ నిధులు లేకపోవడం మూలంగా అభివృద్ధి కుంటూ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించి పటాన్చెరు నియోజకవర్గం నుండి చెల్లిస్తున్న సి ఎస్ ఆర్ నిధులను స్థానికంగా ఖర్చు పెట్టాలని.. లేని పక్షంలో ప్రజల నిరసనను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, దశరథ్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





## బొల్లారంలో రోడ్డు ఆక్రమణల తొలగింపు

### జిహెచ్ఎంసి అధికారుల ఉక్కుపాదం

**అమీన్‌పూర్, ఏప్రిల్ 08(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని బొల్లారం గ్రామంలో రహదారుల విస్తరణ, రవాణా క్రమబద్ధీకరణే ధ్యేయంగా అధికారులు భారీ స్థాయిలో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం బుధవారం విజయవంతంగా ముగిసింది.

ప్రధాన రహదారుల క్లియరెన్స్

బొల్లారం గ్రామంలోని ఐ.టి.సి ప్రాంతం నుండి జ్యోతి చలనచిత్ర ప్రదర్శన శాల వరకు, అలాగే పాత పురపాలక కార్యాలయం నుండి భారత్ చమురు బంకు వరకు ఉన్న ప్రధాన రహదారి మార్గాల్లో ఈ తొలగింపు చర్యలు చేపట్టారు. రహదారికి ఇరువైపులా ఉన్న అడ్డంకులను తొలగించి బాటసారులకు ఇబ్బంది లేకుండా మార్గాన్ని సుగమం చేశారు.

సమన్వయంతో ముందుకు..

పట్టణ ప్రణాళికా బృందం, స్థానిక శాంతి భద్రతల విభాగం మరియు రవాణా నియంత్రణ విభాగం అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రత మధ్య ఈ డ్రైవ్ కొనసాగింది.

86 అక్రమ నిర్మాణాలు నేలమట్టం

ఈ గాలింపు చర్యల్లో భాగంగా మొత్తం 86 అక్రమ ఆక్రమణలను అధికారులు గుర్తించి తొలగించారు. వీటిలో ప్రధానంగా:

లి రహదారిపైకి చొచ్చుకువచ్చిన తాత్కాలిక రేకుల షెడ్లు.

లి అనధికారికంగా నిర్మించిన మెట్లు.

లి దుకాణాల ప్రచార బోర్డులు, ప్రకటన పటాలు.

లి ఇతర తాత్కాలిక అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించి రహదారిని పునరుద్ధరించారు.

అధికారుల హెచ్చరిక: ∩

"రహదారులపై పాదచారులకు, వాహనదారులకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటికే మిగిలిన మరికొన్ని ఆక్రమణలను గుర్తించాం. వాటిని కూడా త్వరలోనే రెండవ విడతలో తొలగిస్తాం. వ్యాపారస్తులు, ప్రజలు ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి ఉండాలి. రహదారులను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు."








printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail. medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..